సాక్షి ఖమ్మం

గురువారం । 27 । ఫిబ్రవరి । 2025



తీర్థాల సంగమేశ్వర ఆలయం వద్ద పుణ్యస్నానాలకు పోటెత్తిన భక్తులు



మరికొన్ని ఫొటోలు 9లో

వైరారూరల్: స్నానాల లక్ష్మీపురం శ్రీ రామలింగేశ్వరస్వామి ఆలయంలో బుధవారం అర్ధరాత్రి జరిగిన శివపార్వతుల కల్యాణంలో పాల్గొన్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క దంపతులు, ఎమ్మెల్యే రాందాస్ దంపతులు





వైరా మండలం స్నానాల లక్ష్మీపురంలోని వైరా నదిలో పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులు



కూసుమంచిలోని గణపేశ్వరాలయంలో స్వామికి పాలాభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు

హరహర మహాదేవ.. శంభోశంకర

జిల్లావ్యాప్తంగా శివాలయాలు ముక్కంటి నామస్మరణతో మార్మోగాయి. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శివాలయాల్లో బుధవారం తెల్లవారుజాము నుంచే అభిషేకాలు, ప్రత్యేక పూజలు మొదలయ్యాయి. వేలాదిగా భక్తులు పిల్లాపాపలతో కలిసి బారులు దీరి స్వామిని దర్శించుకోవడంతో పాటు అభిషేక పూజలు చేశారు. ఎండలు మొదలైన నేపథ్యాన ఆలయాల వద్ద చలువ పందిళ్లు, తాగునీటి వసతి కల్పించారు. ఇక ఖమ్మం రూరల్ మండలం తీర్థాలలో సంగమేశ్వరుడు, వైరా మండలం స్నానాల లక్ష్మీపురంలో శ్రీ రామలింగేశ్వర స్వామి, కారేపల్లిలోని కోటిలింగాల క్షేత్రాల్లో జరిగిన జాతరలకు జిల్లా నలుమూలల నుంచే కాక ఇతర జిల్లాల నుంచీ భక్తులు హాజరయ్యారు. తీర్థాల జాతరకు లక్షన్నర మంది హాజరైనట్టు అధికారులు అంచనా వేస్తున్నారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర సహా ఎమ్మెల్యేలు, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు పలుచోట్ల ఆలయాల్లో జరిగిన పూజలకు హాజరయ్యారు. ఇక బుధవారం అర్ధరాత్రి లింగోద్భవ సమయాన ఆలయాల్లో శివపార్వతుల కల్యాణోత్సవం నిర్వహించగా వేలాదిగా పాల్గొన్న భక్తులు రాత్రంతా జాగరణ చేశారు. –సాక్షి నెట్‌వర్క్

న్యూస్‌రీల్

ప్రవేశాలకు 10వరకు దరఖాస్తుల స్వీకరణ

ఖమ్మం సహకారనగర్: తెలంగాణ మోడల్ స్కూళ్లలో 6నుంచి 10వ తరగతి వరకు ప్రవేశాల కోసం పరీక్ష నిర్వహించనుండగా, మార్చి 10వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని డీఈఓ ఈ.సోమశేఖరశర్మ సూచించారు. అర్హులైన ఓసీ విద్యార్థులు రూ.200, ఎస్సీ, ఎస్టీ, బీసీ, పీహెచ్‌సీ, ఈడబ్ల్యూఎస్ విద్యార్థులైతే రూ.125 చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. వివరాల కోసం http://telanganams.cgg.gov.in వెబ్‌సైట్‌లో పరిశీలించాలని డీఈఓ సూచించారు.

రెండు రాష్ట్రాల స్థాయి కబడ్డీ పోటీలు



పోటీలో తలపడుతున్న క్రీడాకారులు

ఎర్రుపాలెం: ఎర్రుపాలెం మండలం బనిగండ్లపాడులో మహాశివరాత్రి సందర్భంగా తెలంగాణ, ఏపీ రాష్ట్రాల స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నారు. రెండు రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాలకు 35 జట్లు హాజరుకాగా పోటీలను బుధవారం ఎస్‌ఐ పి.వెంకటేష్ ప్రారంభించి మాట్లాడారు. యువత క్రీడల్లో శిక్షణ పొందుతూ పోటీల్లో పాల్గొనడం ద్వారా దేహదారుఢ్యంతో పాటు స్నేహ సంబంధాలు, నాయకత్వ లక్షణాలు పెరుగుతాయని తెలిపారు. బనిగండ్లపాడు శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి ఆలయ కమిటీ చైర్మన్ యన్నం పిచ్చిరెడ్డి, వైస్ చైర్మన్ పెద్దమళ్ల మోహన్‌రావు, సొసైటీ మాజీ చైర్మన్ యన్నం సత్యనారాయణరెడ్డి, పీఈటీలు గూడూరు సత్యనారాయణరెడ్డి, తల్లపురెడ్డి గోపి, కోనా రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కంగుతిన్న టాప్ సీడెడ్ క్రీడాకారులు

ఖమ్మం స్పోర్ట్స్: ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో జరుగుతున్న ఆల్ ఇండియా ర్యాంకింగ్ పురుషుల టెన్నిస్ టోర్నీలో టాప్ సీడెడ్ క్రీడాకారులకు చుక్కెదురైంది. బుధవారం జరిగిన మ్యాచ్‌లో టాప్ సీడెడ్ క్రీడాకారుడు ఉదిత్‌కంబోజ్(హర్యానా) సింగిల్స్ క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో అథర్వశర్మ(మహారాష్ట్ర)తో తలపడగా ఓటమి పాలయ్యాడు. అలాగే, తెలంగాణకు చెందిన నాలుగో ర్యాంక్ క్రీడాకారుడు శశాంక్ ఢిల్లీకి చెందిన రిక్కీచౌదరి చేతిలో ఓడిపోయాడు. అయితే శశాంక్ గాయపడడంతో చికిత్స తీసుకున్నా పరిస్థితులు అనుకూలించలేదు. కాగా, అథర్వశర్మ, రిక్కీచౌదరితో పాటు వంశ్‌బిష్ట్(ఢిల్లీ), దేబాసిస్ సాహూ(ఒడిశా) సెమీస్‌కు చేరారు. డబుల్స్ క్వార్టర్ ఫైనల్స్‌లో ఓగెస్ తేజో–జయప్రకాష్(తమిళనాడు)–ఉదిత్ కంబోజ్(హర్యానా), దీపక్(కర్ణాటక)–రక్షక్ తరుణ్ (తమిళనాడు)పై, వంశ్ బిష్ట్(ఢిల్లీ), దేబాసిస్ సాహూ(ఒడిశా)–రిక్కీచౌదరి(ఢిల్లీ), జతిన్ సైన్(హర్యానా)పై, దుద్దపూడి ఆదిత్యవర్ధన్, గనగాము నైషిక్ రెడ్డి(తెలంగాణ)–సార్థక్ గులాటి(పంజాబ్)–సందేశ్ డి.కురాలే(మహారాష్ట్ర)పై గెలిచారు. కాగా, బుధవారం మ్యాచ్‌లను టెన్నిస్ అసోసియేషన్ బాధ్యులు చల్లపల్లి శ్రీనివాస్‌రావు, డాక్టర్ అనిల్, కాంపాటి సత్యనారాయణ ప్రారంభించారు.

అమిత్‌షా దృష్టికి సైలో బంకర్ సమస్య



అమిత్‌షాకు వినతిపత్రం ఇస్తున్న పొంగులేటి సుధాకర్‌రెడ్డి

సత్తుపల్లి: సత్తుపల్లి మండలం కిష్టారంలో సింగరేణి సంస్థ ఏర్పాటుచేసిన సైలోబంకర్ కాలుష్యం కారణంగా ఇబ్బంది పడుతున్నామని అంబేద్కర్ నగర్ కాలనీవాసులు కొన్నాళ్లుగా దీక్షలు నిర్వహిస్తున్నారు. ఈమేరకు సమస్యపై కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాకు బుధవారం కోయంబత్తూరులో వినతిపత్రం ఇచ్చినట్లు మాజీ ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకర్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. సైలో బంకర్ కాలుష్యంతో స్థానికులు అనారోగ్యం పాలవుతుండగా, ఇప్పటికే పలువురు మృత్యువాత పడ్డారని.. సీహెచ్‌పీ నిర్మాణంలోనూ లోపాలు ఉన్నందున విచారణ జరిపించాలని కోరినట్లు పేర్కొన్నారు. కాగా, కిష్టారం అంబేద్కర్‌నగర్ కాలనీవాసులు చేపట్టిన దీక్షలు బుధవారం 17వ రోజుకు చేరాయి. మహాశివరాత్రి సందర్భంగా పాఠశాలలకు సెలవు కావడంతో దీక్షలో పిల్లలు కూర్చున్నారు. కమిటీ బాధ్యులు మారోజు శ్రీను, పాలకుర్తి నాగేశ్వరరావు, మారోజు నాగేశ్వరరావు, కడారి మదీనా, పాలకుర్తి రాజు, పాలకుర్తి ప్రభుదాసు, పాలకుర్తి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్‌కు రెడీ..

నేడు టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికలు

- ఉదయం 8నుంచి సాయంత్రం 4గంటల వరకు పోలింగ్
- ఉమ్మడి జిల్లాలో 47కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి
- ఎన్నికల బరిలో 19 మంది అభ్యర్థులు

ఖమ్మం – నల్లగొండ – వరంగల్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గ ఎన్నికకు ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఏర్పాట్లు పూర్తయ్యాయి. గురువారం ఉదయం 8నుంచి సాయంత్రం 4గంటల వరకు 47 కేంద్రాల్లో పోలింగ్ జరగనుంది. జిల్లా కేంద్రాల నుంచి ఉద్యోగులు సామగ్రితో బుధవారం సాయంత్రంకల్లా పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. – సాక్షి ప్రతినిధి, ఖమ్మం



కలెక్టరేట్ డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలో సామగ్రి సరిచూసుకుంటున్న ఉద్యోగులు

ఖమ్మం జిల్లాలోనే ఎక్కువ

ఉమ్మడి జిల్లాలో టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికకు 6,111 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో పురుషులు 3,440 మంది, మహిళా ఓటర్లు 2,671 మందితో జాబితా సిద్ధమైంది. జిల్లాల వారీగా చూస్తే ఖమ్మం జిల్లాలో 4,089మంది ఓటర్లకు గాను పురుషులు 2,372 మంది, మహిళలు 1,717, భద్రాద్రి జిల్లాలో 2,022 మంది ఓటర్లకు గాను పురుషులు 1,068, మహిళా ఓటర్లు 954 మంది ఉన్నారు. రెండు జిల్లాలో కలిపి 47 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. అత్యధికంగా ఖమ్మం రిక్కాబజార్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నాలుగు కేంద్రాలు ఉండగా, 1,986 మంది ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. ఆతర్వాత జలగంనగర్‌లోని జిల్లా పరిషత్ పాఠశాలలో 488 మంది ఓటర్లు ఉన్నారు. ఖమ్మం జిల్లాలో ఏర్పాటు చేసిన 24 కేంద్రాల్లో సగానికి పైగా ఓటర్లు ఈ కేంద్రాల్లోనే ఓటు వేయనున్నారు. అలాగే, భద్రాద్రి జిల్లాలో ఎక్కువగా భద్రాచలంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో 250 మంది, ఇల్లెందులోని జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో 210 మంది, చుంచుపల్లిలోని బాబుక్యాంపు బాలికల ఉన్నత పాఠశాల కేంద్రంలో 175 మంది ఓటర్లు ఉన్నారు.

కేంద్రాలకు చేరిన సిబ్బంది

ఎన్నికల విధులు నిర్వర్తించే ఉద్యోగులు బుధవారం రాత్రి వరకు పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. ఖమ్మం కలెక్టరేట్‌లో పోలింగ్ సామగ్రి పంపిణీని అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి, డీఆర్వో ఏ.పద్మశ్రీ పర్యవేక్షించారు. ఖమ్మం జిల్లాను ఎనిమిది రూట్లుగా విభజించి సిబ్బందిని ఆర్టీసీ బస్సుల్లో పంపించారు. కాగా, పోలింగ్ కేంద్రాలను పోలీసు బలగాలు తమ ఆధీనంలోకి తీసుకుని కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేశాయి. ఎన్నికల విధుల్లో పాల్గొనే 56 మంది పీఓల (ప్రిసైడింగ్ అధికారులు)కుగాను ఖమ్మం జిల్లాలో 28 మంది, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 28 మంది ఉన్నారు. వీరు కాక ఏపీఓలు, ఓపీఓలు, మైక్రో అబ్జర్వర్లు, సెక్టార్ అధికారులు విధులు నిర్వర్తిస్తారు. పోలింగ్ ముగిశాక బ్యాలెట్ బాక్సులను నల్లగొండలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రానికి తరలించేలా ఏర్పాట్లు చేశారు.



బ్యాలెట్ బాక్స్‌లు, ఇతర సామగ్రితో వెళ్తూ...



పోలింగ్ బూత్‌లో ఏర్పాట్లు చేస్తున్న ఉద్యోగులు

ఆ రెండు ప్రాధాన్యతలే కీలకం

ఈ ఎన్నికల బరిలో 19 మంది అభ్యర్థులు ఉన్నారు. దీంతో ఓటర్లు 1నుంచి 19 వరకు ప్రాధాన్యత ఇస్తూ అంకెల ద్వారా ఓటు వేయొచ్చు. అయితే, 1, 2వ నంబర్ వేసే ఓట్లకే ప్రాధాన్యత ఉంది. ఒకటో ప్రాధాన్యత ఓట్ల లెక్కింపుతో గెలుపు తేలకపోతే రెండో ప్రాధాన్యత ఓటు లెక్కింపుతో విజేతను ఖరారు చేస్తారు. మొత్తం పోలైన ఓట్లలో 51శాతం వచ్చిన వారినే విజేతగా ప్రకటిస్తారు. 19మంది అభ్యర్థుల్లో ఒకటో ప్రాధాన్యత ఓట్లు ఎవరికి ఎక్కువ వచ్చినా.. పోలైన ఓట్లలో వారికి ఈ ప్రాధాన్యత ఓట్లు 51 శాతంగా ఉంటేనే విజయం ఖరారవుతుంది. అయితే, మొదటి ప్రాధాన్యత ఓట్లలో 51 శాతం ఓట్లు ఎవరికీ రాకపోతే రెండో ప్రాధాన్యత ఓట్లు లెక్కిస్తూ.. తక్కువ ఓట్లు వచ్చిన వారిని ఎలిమినేట్ చేస్తారు. ఇలా మొత్తం అభ్యర్థుల్లో చివరి వరకు ఎవరికి 51 శాతం ఓట్లు ఉంటే వారినే గెలుపు వరిస్తుంది. ఫలితంగా బరిలో ఉన్న అభ్యర్థులు ఒకటో ప్రాధాన్యత ఓటుతో పాటు రెండో ప్రాధాన్యత ఓటునూ కీలకంగా తీసుకున్నారు. గత ఎన్నికల్లో అలుగుబెల్లి నర్సిరెడ్డి రెండో ప్రాధాన్యత ఓట్లతోనే గెలుపొందిన విషయం విదితమే.

ఓటర్లు, పోలింగ్ సిబ్బంది వివరాలు

జిల్లా	ఖమ్మం	భద్రాద్రి కొత్తగూడెం	మొత్తం
ఓటర్లు	4,089	2,022	6,111
పోలింగ్ కేంద్రాలు	24	23	47

	పీఓలు	ఏపీఓలు	ఓపీఓ-1, ఓపీఓ-2	మైక్రో అబ్జర్వర్లు	పోలీస్ సిబ్బంది
రెండు జిల్లాల్లో పోలింగ్ సిబ్బంది	56	57	104	56	940

పోలింగ్ విధులు పకడ్బందీగా నిర్వహించాలి



సామగ్రి పంపిణీపై ఆరా తీస్తున్న అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి, డీఆర్వో పద్మశ్రీ

ఖమ్మం సహకారనగర్: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌లో లోటుపాట్లు ఎదురుకాకుండా ఉద్యోగులు విధులు నిర్వర్తించాలని అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి సూచించారు. కలెక్టరేట్‌లోని డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని జిల్లా రెవెన్యూ అధికారిణి ఏ.పద్మశ్రీతో కలిసి బుధవారం పరిశీలించిన ఆయన ఉద్యోగులకు సూచనలు చేశారు. కేంద్రాల్లో సామగ్రిని సరిచేసుకుని ఏర్పాట్లు చేసుకోవాలని, ఓటర్ల హక్కులకు భంగం కలగకుండా పోలింగ్ జరిగేలా చూడాలని తెలిపారు. ఎండల దృష్ట్యా ప్రతీ పోలింగ్ కేంద్రం వద్ద చల్లని నీరు, క్యూలైన్లపై టెంట్ వేయించామని, పోలీసు బందోబస్తు ఉంటుందని చెప్పారు. ఈకార్యక్రమంలో కలెక్టరేట్ ఏఓ అరుణ, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు స్వామి, కలెక్టరేట్ ఎన్నికల డీటీ అన్సారీ తదితరులు పాల్గొన్నారు.

‘పవర్’ఫుల్ శిక్షణ

- ఆర్టీసీ ఉద్యోగుల్లో వృత్తి నైపుణ్యాల పెంపునకు నిర్ణయం
- రోజుకు 40 మంది చొప్పున 182 అంశాలపై అవగాహన
- రీజియన్‌లోని ఆరు డిపోల్లో తరగతులు



శిక్షణ తరగతుల బ్యానర్

సత్తుపల్లిటౌన్: ప్రయాణికులు మరింత మంది ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణించేలా సంస్థ అనేక ప్రయత్నాలు చేస్తోంది. ప్రజలకు మెరుగైన సేవలందిస్తూ వారికి సంస్థపై నమ్మకం పెంచడం, తద్వారా ఆదాయాన్ని రాబట్టుకునేలా కార్యక్రమాలు రూపొందిస్తోంది. ఇదేసమయాన ఉద్యోగుల సంక్షేమంపైనా దృష్టి సారించిన యాజమాన్యం ఏటా వైద్యపరీక్షలు నిర్వహిస్తోంది. ఈక్రమంలో ప్రయాణికులతో వ్యవహరించాల్సిన తీరు, ఇతర అంశాలపై సిబ్బందికి అవగాహన కల్పించేలా మరో కార్యక్రమానికి రూపకల్పన చేసింది.

రద్దీ నేపథ్యాన...

రాష్ట్రప్రభుత్వం మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించింది. దీంతో ఎక్స్‌ప్రెస్, పల్లెవెలుగు బస్సుల్లో రద్దీ గణనీయంగా పెరిగింది. ఈ కారణంగా కండక్టర్లు, డ్రైవర్లు, ట్రాఫిక్ సూపర్‌వైజర్లకు విధినిర్వహణ సవాల్‌గా మారిందని చెబుతున్నారు. ఈ నేపథ్యాన ఉద్యోగుల్లో వృత్తి నైపుణ్యం, వ్యక్తిత్వ వికాసం పెంపొందించి యజమానిననే భావన కల్పించేందుకు ‘పవర్’ పేరిట శిక్షణ తరగతులు నిర్వహిస్తోంది. ఖమ్మం రీజియన్‌లోని ఏడు డిపోల్లో ఈనెల 18వ తేదీన మొదలైన శిక్షణ వచ్చేనెల 2వ తేదీ వరకు కొనసాగనుంది. మొత్తం ఏడు డిపోల్లో కలిపి 681 మంది ఆర్టీసీ డ్రైవర్లు, 427 మంది అద్దె బస్సు డ్రైవర్లతో పాటు 860 మంది కండక్టర్లు, 204 మంది ట్రాఫిక్ సూపర్‌వైజర్లు, ఉద్యోగులకు శిక్షణ ఇస్తున్నారు. 2022 సంవత్సరంలో ‘ఒక గొప్పమార్పుకు ఇదే శ్రీకారం’, 2023లో ‘ట్యాక్ట్’ పేరిట కార్యక్రమాలు నిర్వహించిన విషయం విదితమే.

182 అంశాలపై..

పవర్(పీక్ పర్‌ఫార్మెన్స్ త్రూ ఓనర్‌షిప్ విత్ ఎంపతి రిసాల్వ్) పేరిట ఈ ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. ప్రతీ డిపోలో రోజుకు 40 మంది చొప్పున ఉద్యోగులకు డిపో మేనేజర్ ఆధ్వర్యాన శిక్షణ ఇస్తున్నారు. పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా 182 అంశాలపై వీడియోలు, చిత్రాలు ప్రదర్శిస్తూ అందులోని సారాంశాన్ని వివరించడమే కాక.. అప్పటికప్పుడే పరీక్ష నిర్వహిస్తున్నారు. అలాగే, స్కిట్ల ప్రదర్శన ద్వారా సిబ్బందిలో సృజనాత్మకతను పెంపొందించే ప్రయత్నం జరుగుతోంది. అందుబాటులో ఉన్న వనరులను సద్వినియోగం చేసుకుంటూ ఎక్కువ ఫలితాలను సాధించడం, మరింత శక్తి వినియోగం ఆవశ్యకతను ఇందులో వివరిస్తున్నారు.



సత్తుపల్లిలో అవగాహన కల్పిస్తున్న డీఎం రాజ్యలక్ష్మి

శిక్షణలో అంశాలు

ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లు, సూపర్‌వైజర్లు, సిబ్బందిలో ధృఢ సంకల్పం, వ్యక్తిత్వ వికాసం పెంపు, రహదారి భద్రత, ప్రయాణికులతో సత్ప్రవర్తన, వస్త్రధారణపై అవగాహన, ఆరోగ్యం విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఈ శిక్షణలో భాగంగా వీడియోలు, ప్రసంగాల ద్వారా వివరిస్తున్నారు. తొలుత డిపోల వారీగా అధికారులకు హైదరాబాద్ బస్ భవన్‌లో శిక్షణ ఇవ్వగా, వారి ఆధ్వర్యాన డిపోల్లో సిబ్బందికి శిక్షణ తరగతులు కొనసాగుతున్నాయి.

అవగాహన పెరిగింది..



బాధ్యతగా ఉండడం, ప్రయాణికులతో మర్యాదపూర్వకంగా మాట్లాడడమే కాక వ్యక్తిగత క్రమశిక్షణపై ఇచ్చిన శిక్షణ చాలా బాగుంది. నైపుణ్యాలు పెంచుకునేలా వీడియోల ద్వారా అనేక అంశాలను వివరించారు. ఒకేరోజులో వృత్తిగత, వ్యక్తిగత అంశాల అవగాహన ఏర్పడింది.

– ఎస్.కే.మహబూబీ, కండక్టర్, సత్తుపల్లి

నైపుణ్యాల పెంపే లక్ష్యం



ఉద్యోగుల్లో యజమానులనే భావన ఏర్పడితే మరింత అంకిభావంతో పనిచేస్తారని నైపుణ్యాలు పెంచేలా శిక్షణ ఇస్తున్నాం. ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లతో పాటు అద్దె బస్సు డ్రైవర్లకూ శిక్షణ ఇప్పిస్తున్నాం. సంస్థను ప్రజలకు మరింత చేరువ చేసి ఆదాయాన్ని పెంచడమే లక్ష్యం.

– ఏ.నరిరామ్, ఆర్టీసీ రీజినల్ మేనేజర్

డైరెక్టర్(పా) నియామకం ఎప్పుడో?

- సింగరేణిలో 26 రోజులుగా ఖాళీగానే కుర్చీ
- పెండింగ్‌లో బిల్లులు, ఇతర ఫైళ్లు

సింగరేణి(కొత్తగూడెం): దక్షిణ భారతదేశానికే తలమానికంగా నిలుస్తున్న సింగరేణి సంస్థలోని కీలకమైన డైరెక్టర్(పా – పర్సనల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ వెల్ఫేర్) పోస్టు ఎప్పుడు భర్తీ చేస్తారనే సందిగ్ధత నెలకొంది. ప్రాజెక్ట్ అండ్ ప్లానింగ్ డైరెక్టర్ జి.వెంకటేశ్వరరెడ్డికి డైరెక్టర్ (పా)గా యాజమాన్యం నాలుగు మాసాల క్రితం అదనపు బాధ్యతలు అప్పగించింది. ఆయన పదవీకాలం జనవరి 31తో ముగియగా.. ఆనాటి నుంచి డైరెక్టర్(పా) పోస్టు ఖాళీగానే ఉంటోంది. ఇటీవల డైరెక్టర్ పీపీ, డైరెక్టర్ ఆపరేషన్స్ పోస్టులను భర్తీ చేయగా, ఆ సమయంలోనే (పా) పోస్టు కూడా భర్తీ చేస్తారని భావించినా అలా జరగలేదు. ఫలితంగా కంపెనీకి సంబంధించిన బిల్లులు, ఇతర ఫైళ్లు పేరుకుపోతున్నట్లు సమాచారం.

2014 నుంచి అదనపు బాధ్యతలే..

సింగరేణి సంస్థలో సీఎండీ తర్వాత డైరెక్టర్(పా) పోస్టును కీలకంగా చెబుతారు. దీంతో ఈ పోస్టులో ఐఏఎస్ అధికారిని నియమించాల్సి ఉండగా యాజమాన్యం, ప్రభుత్వం 2014 నుంచి అదనపు బాధ్యతలతోనే కాలం వెళ్లదీస్తున్నాయి. 2011లో ఈ స్థానంలో ఐఏఎస్ అధికారి విజయకుమార్‌ను నియమించగా, తెలంగాణ ఏర్పడ్డాక ఆయనను బదిలీ చేశారు. ఆపై డైరెక్టర్ ఫైనాన్స్‌గా వచ్చిన వివేకానంద, పవిత్రన్‌కుమార్, బలరామ్, ఆ తర్వాత డైరెక్టర్ ఆపరేషన్స్‌గా విధులు నిర్వర్తించిన చంద్రశేఖర్, డైరెక్టర్ పీపీగా పనిచేసిన వెంకటేశ్వరరెడ్డికి డైరెక్టర్(పా)గా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ వచ్చారు. కానీ పూర్తిస్థాయి ఐఏఎస్ అధికారి లేక కార్మికుల సమస్యలు పేరుకుపోతున్నాయని, పరిపాలనా పరంగా ఇబ్బందులు ఎదురవుతున్నాయనే చర్చ జరుగుతోంది. ఈమేరకు ప్రభుత్వం స్పందించి పూర్తిస్థాయి డైరెక్టర్‌గా ఐఏఎస్ అధికారిని నియమించాలని కోరుతున్నారు. ఇక నిపుణులైన అధికారులు ఉన్నా జీఎంల నుంచి డైరెక్టర్ల వరకు ఒకే అధికారికి రెండేసి పోస్టులు కట్టబెడుతున్నారు. ఫలితంగా అధికారులు ఎటూ పూర్తిస్థాయిలో న్యాయం చేయలేకపోతుండగా, ఫైళ్లు పెండింగ్‌లో ఉంటున్నాయని తెలుస్తోంది.

క్లుప్తంగా

శ్రీకాళహస్తిలో మంత్రి తుమ్మల


ఆలయంలో మంత్రి తుమ్మల, తదితరులు

ఖమ్మంవన్‌టౌన్: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు బుధవారం ఏపీలోని శ్రీకాళహస్తిలో ప్రత్యేక పూజలు చేశారు. మంత్రి తనయుడు తుమ్మల యుగంధర్‌తో పాటు కంభంపాటి రామ్మోహన్‌రావు, గరికపాటి మోహన్‌రావు తదితరులు ఉన్నారు.

ఎత్తిపోతల పథకం ద్వారా సాగునీరు విడుదల

కూసుమంచి: మండలంలోని నర్సింహులగూడెం ఎత్తిపోతల పథకం ద్వారా బుధవారం సాగునీరు విడుదల చేశారు. ఈమేరకు జలవనరులశాఖ డీఈఈ రమేష్‌రెడ్డి మోటార్లను ఆన్ చేసి నీటిని వదిలారు. గత ఏడాది సెప్టెంబర్‌లో వచ్చిన వరదలతో ఎత్తిపోతల పథకం పంప్‌హౌస్ దెబ్బతినగా సరఫరా నిలిచిపోయింది. దీంతో పథకం పరిధి ఆయకట్టులో పంటలు ఎండిపోతుండగా రైతులు తమ సమస్యను మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో మంత్రి ఆదేశాల మేరకు అధికారులు మరమ్మతులు చేపట్టి నీరు విడుదల చేశారు. ఈ పథకం ద్వారా కూసుమంచి, తురకగూడెం, కిష్టాపురం, చింతలతండా గ్రామాల్లో భూములకు సాగునీరు అందనుండగా, రైతులు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.20,487

పర్యాటకంపై పట్టింపేది?

వైరా రిజర్వాయర్ వద్ద అసంపూర్తిగా ట్యాంక్ బండ్
- మరోపక్క నిర్మాణం పూర్తయిన భవనాలు శిథిలం
- ప్రకృతి అందాలను ఆస్వాదించలేకపోతున్న ప్రజలు

వైరా: ఏళ్ల క్రితం జిల్లాలోనే పర్యాటకంగా అత్యంత ప్రాచుర్యం పొందిన వైరా రిజర్వాయర్ ఇప్పుడు బోసిపోతోంది. ప్రకృతి అందాలను తిలకించాలని వచ్చే పర్యాటకులకు ఇక్కడి అసౌకర్యాలు నిరాశకు గురిచేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎకో టూరిజం పేరిట జిల్లాలోని కనకగిరి గుట్టలు తదితర ప్రాంతాల అభివృద్ధికి నిధులు కేటాయిస్తోంది. కానీ వైరా రిజర్వాయర్‌పై అటు అధికారులు, ఇటు ప్రజాప్రతినిధులకు పట్టింపు కరువవడంపై ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

కళ తప్పిన రిజర్వాయర్ అందాలు

వైరా రిజర్వాయర్, సమీపంలోని గుట్టలను కలుపుతూ పర్యాటక కేంద్రంగా అభివృద్ధికి 2005లో జిల్లా పర్యాటక శాఖ ఆధ్వర్యాన పలు కార్యక్రమాలు చేపట్టారు. కానీ నిర్వహణ లోపంతో అవన్నీ ఇప్పుడు కళతప్పాయి. సుమారు రూ.2 కోట్ల వ్యయంతో కెఫెటేరియా, వాటర్ ఫౌంటెన్లు, స్పీడ్, పెడల్ బోట్లు ఏర్పాటు చేశారు. గ్రీనరీతో పాటుగా లైటింగ్ ఏర్పాటుచేసి రెస్టారెంట్ నిర్వహణకు భవనాలు నిర్మించారు. కానీ ఇప్పుడు అవన్నీ శిథిలమై ఎందుకూ పనికిరాకుండా పోయాయి.


వైరా రిజర్వాయర్ వద్ద కళ కోల్పోయిన పర్యాటక భవనం (ఇన్‌సెట్) శిథిలావస్థకు చేరిన వాటర్ ఫౌంటెన్

ట్యాంకు బండ్‌కు రూ.5 కోట్లు

రిజర్వాయర్‌ను పర్యాటక అభివృద్ధి చేయడంలో భాగంగా రూ.5 కోట్ల నిధులతో ట్యాంకు బండ్ నిర్మాణం చేపట్టినా పనులు పూర్తికాలేదు. అయితే, ఆనకట్టపై పచ్చని మొక్కలు పెంచడమే కాక సోలార్ లైట్లు ఏర్పాటుచేసి పుట్‌పాత్‌లైతే నిర్మించారు. ఇప్పుడు మొక్కల ఆనవాళ్లు లేకపోగా పిచ్చిమొక్కలు పెరిగి అందహీనంగా తయారైంది.

పట్టింపే లేదు..

వైరా రిజర్వాయర్‌ను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలనే అంశంపై ఎవరికీ పట్టింపు లేకపోవడంతోనే ఈ పరిస్థితి నెలకొందని స్థానికులు ఆరోపిస్తున్నారు. కొన్నాళ్ల క్రితం రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క రిజర్వాయర్‌ను పరిశీలించి ఎకో టూరిజం ద్వారా అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తామని ప్రకటించారు. కానీ ఆచరణరూపం దాల్చకపోగా, కనీసం అధికారులైనా ఈ అంశంపై కనీస ప్రతిపాదనలు సిద్ధం చేయకపోవడం గమనార్హం.

ఇవీ ప్రత్యేకతలు..

రిజర్వాయర్ అందాలను సూర్యోదయం, సూర్యాస్తమ సమయాల్లో చూడడానికి రెండు కళ్లు సరిపోవనే చెప్పాలి. ఈక్రమాన ఇక్కడ మొక్కలు పెంచడం, వాకింగ్ ట్రాక్‌లు నిర్మించడంతో పాటు రిజర్వాయర్‌లో బోటింగ్ ఏర్పాటు చేస్తే పర్యాటకులను ఆకట్టుకునే అవకాశముంటుంది. అలాగే, రెస్టారెంట్‌ను పునరుద్ధరించి ఫౌంటెన్లు ఏర్పాటుచేస్తే జిల్లా వాసులు ఓ పూట సేద తీరే అవకాశం ఏర్పడుతుంది. వైరా రిజర్వాయర్ జిల్లా కేంద్రం నుంచి 20 నిమిషాల్లో చేరుకునే అవకాశమున్నందున జిల్లా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు ఇకనైనా పర్యాటక అభివృద్ధిపై స్పందించాలని వినతులు వెల్లువెత్తుతున్నాయి.


సాయంత్రం వేళ వైరా రిజర్వాయర్ అందాలు

త్వరలోనే నిధులు మంజూరు



వైరా రిజర్వాయర్ పర్యాటక అభివృద్ధికి అవసరమైన నిధుల కోసం ప్రభుత్వానికి నివేదించాం. సాధ్యమైనంత త్వరలోనే నిధులు మంజూరవుతాయని భావిస్తున్నా. ఈ దిశగా నా వంతు కృషి చేస్తున్నా.

– మాలోత్ రాందాస్‌నాయక్, ఎమ్మెల్యే, వైరా

ప్రజలంతా సుభిక్షంగా ఉండాలి

ఆలయాల్లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పూజలు

మధిర/ముదిగొండ/చింతకాని/వైరారూరల్: రాష్ట్ర ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని పరమేశ్వరుడిని వేడుకున్నట్లు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. మహాశివరాత్రి సందర్భంగా మధిర మృత్యుంజయ స్వామి, చింతకాని మండలంలోని నేరడ శివాలయం, ముదిగొండ మండలం వల్లాపురంలోని వద్ద మల్లికార్జునస్వామి దేవస్థానంలో భట్టి విక్రమార్క – నందిని దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా భట్టి మాట్లాడుతూ ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని పూజలు చేసినట్లువెల్లడించారు. అలాగే, తమ స్వగ్రామమైన వైరా మండలం స్నానాల లక్ష్మీపురంలో శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో కూడా పూజలు చేసిన భట్టి దంపతులు జాతర ఏర్పాట్లను పరిశీలించారు. అలాగే, సమీపాన షాపులో మిఠాయి కొనుగోలు చేసిన భట్టి విక్రమార్క భక్తులకు పంపిణీ చేశారు.


వైరారూరల్: స్నానాల లక్ష్మీపురంలో మిఠాయి కొనుగోలు చేస్తున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

కబడ్డీ పోటీలు ప్రారంభం

క్రీడలు ఐకమత్యాన్ని పెంపొందిస్తాయని డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క తెలిపారు. చింతకాని మండలం నేరడలో మహాశివరాత్రి సందర్భంగా నేతాజీ యువజన సంఘం ఆధ్వర్యాన ఏర్పాటుచేసిన తెలంగాణ, ఏపీ రాష్ట్రాల స్థాయి కబడ్డీ పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. గ్రామీణ క్రీడలు, క్రీడాకారులను అందరూ ప్రోత్సహించాలని తెలిపారు. ఈకార్యక్రమాల్లో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, రాష్ట్ర హస్తకళల కార్పొరేషన్ చైర్మన్ నాయుడు సత్యం, నీటిపారుదల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ మువ్వా విజయ్‌బాబుతో పాటు నాయకులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, వేమిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, సూరంశెట్టి కిషోర్, రంగా శ్రీనివాసరావు, దారా బాలరాజు, దూసరి నేతాజీ, దూసరి గోపాలరావు, పెరిక ప్రభాకర్, గోగుల ఆది, షేక్ దస్తగిరి, మట్టా రవి, మహేష్, వెంకట్రావు, రాధాకృష్ణ, వినయ్, కొమ్మినేని రమేష్, తాటికొండ రమేష్, బొర్రా రాజశేఖర్, సూతకాని జైపాల్, శీలం వెంకటనర్సిరెడ్డి, ఏదునూరి సీతారాములు, మల్లు రామకృష్ణ, దొడ్డా పుల్లయ్య, నూతి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.


చింతకాని: కబడ్డీ పోటీలను ప్రారంభిస్తున్న భట్టి

మెడిసిన్ విద్యార్థినికి రూ.1.21లక్షల ఆర్థికసాయం

కల్లూరు: మండలంలోని విశ్వనాథపురం గ్రామానికి చెందిన భూషం కృష్ణప్రసాద్ – సునీత దంపతుల కుమార్తె తేజస్వి ఖమ్మం ప్రభుత్వ మెడికల్ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతోంది. వీరి కుటుంబం ఆర్థికంగా ఇబ్బంది పడుతుండడంతో ఫీజులు, హాస్టల్ ఫీజు చెల్లించలేని పరిస్థితి ఎదురైంది. దీంతో స్ఫూర్తి ఫౌండేషన్ ప్రతినిధి వరకా రామారావు దృష్టికి తీసుకెళ్లగా ఆయన దాతల చేయూతతో మొదటి విడతగా రూ.1,21,500ను తేజస్వికి అందచేశారు. ఈ సందర్భంగా స్ఫూర్తి ఫౌండేషన్ బాధ్యులు, రామారావుకు తేజస్వి, తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.


తేజస్వికి చెక్కు అందిస్తున్న రామారావు

మిర్చి క్రయవిక్రయాలపై రైతు సంఘం నేతలతో భేటీ

ఖమ్మంవ్యవసాయం: రాష్ట్ర నలుమూలల నుంచి రైతులు ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు మిర్చి తీసుకొస్తుండడంతో క్రయవిక్రయాల్లో చేపట్టాల్సిన సంస్కరణలపై మార్కెట్ కమిటీ బాధ్యులు సమీక్షించారు. ఈసందర్భంగా బుధవారం రైతు సంఘాల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశానికి మార్కెట్ చైర్మన్ యరగర్ల హన్మంతరావు అధ్యక్షత వహించారు. కాంగ్రెస్, సీపీఎం, సీపీఐ, న్యూడెమోక్రసీ, మాస్‌లైన్ తదితర పార్టీల అనుబంధ రైతు సంఘాలు, వ్యవసాయ కార్మిక సంఘాల ప్రతినిధులు పాల్గొని క్రయవిక్రయాల్లో జరుగుతున్న లోటుపాట్లు, జెండాపాటలో ఖరారైన ధరను విస్మరిస్తుండడాన్ని ప్రస్తావించారు. కమీషన్ల విషయంలోనూ అడ్తీదారులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని, అనుమతి లేని వారు మార్కెట్‌లోకి వస్తూ పంట ఉత్పత్తులను తీసుకెళ్తున్నారని తెలిపారు. అంతేకాక రైతులకు తాగునీరు, టాయిలెట్ల సౌకర్యం కల్పించాలని కోరగా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని చైర్మన్ తెలిపారు. ఈసమావేశంలో మార్కెట్ వైస్ చైర్మన్ తల్లాడ రమేష్, ఉన్నత శ్రేణి కార్యదర్శి పి.ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో పాల్గొన్న చైర్మన్, అధికారులు, సంఘాల ప్రతినిధులు


పల్లాల బావి


గుట్టపై కోట ముఖద్వారం

కాకతీయుల కళావైభవ చిహ్నాలు


గుట్ట కింద హస్తాల వీరన్న విగ్రహం

కాకతీయ రాజులు 16వ శతాబ్దంలో కనకగిరి గుట్టలపై పలు నిర్మాణాలు చేపట్టారని చరిత్ర ద్వారా తెలుస్తోంది. ఈ నిర్మాణాలు ఇప్పుడు పర్యాటకులను ఆకట్టుకుంటున్నాయి. ఖమ్మం జిల్లా కల్లూరు మండలం నుంచి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చండ్రుగొండ మండలం వరకు కనకగిరి గుట్టలు వ్యాపించి ఉండగా.. గుట్టపై కోట ఆనవాళ్లు, పల్లాల బావి వద్ద వీరభద్రుడి ఆలయం కనిపిస్తాయి. ఈ ఆలయంలో ఏటా మహాశివరాత్రికి స్వామి కల్యాణోత్సవం జరిపించడం ఆనవాయితీగా వస్తోంది. అలాగే, పల్లాల బావి గత వైభవానికి చిహ్నంగా కనిపిస్తుండగా.. ఈ బావిలో నీటిలో పల్లాలు తేలేవని చెబుతారు. ఇక గుట్ట కింద ఉన్న హస్తాల వీరన్నను గిరిజనులు భక్తి శ్రద్ధలతో కొలుస్తారు. ప్రస్తుతం ఈ ప్రాంతాన్ని అటవీ, పర్యాటక శాఖల సంయుక్త ఆధ్వర్యాన ఎకో టూరిజం కింద అభివృద్ధి చేస్తున్నారు. – స్టాఫ్ ఫొటోగ్రాఫర్

చెరువు శిఖం భూములు హాంఫట్

- అక్రమార్కుల చెరలో లోతట్టు ప్రాంతాలు
- జలాశయాల్లోనే హద్దులు.. ఆపై చేపల చెరువుల ఏర్పాటు
- మత్స్యకారుల పొట్ట కొట్టేలా కబ్జాదారుల తీరు

ఖమ్మంవ్యవసాయం: జిల్లాలోని పలుచోట్ల చెరువు శిఖం భూముల ఆక్రమణ యథేచ్ఛగా జరుగుతోంది. గ్రామాలు, పట్టణ శివారుల్లో అంగబలం, అర్థబలం ఉన్న పలువురు ప్రభుత్వ భూముల ఆక్రమణకు తెగపడుతున్నారు. రైతులు సాగు చేసుకుంటున్న శిఖం భూములు, దాహార్తి తీర్చే జలాశయాల లోతట్టు భూములనూ వదలకపోగా రాళ్లు, కంచెలతో హద్దులు పాతుకుంటుండడం గమనార్హం. ఇక కొందరైతే లోతట్టులో కొంత ప్రాంతాన్ని ఆక్రమించుకు చేపల చెరువులుగా మార్చుకుంటున్నారు. జిల్లాలోని పలుచోట్ల జలాశయాల ఆక్రమణలు శృతి మించినా ప్రభుత్వ శాఖలు చూసీచూడనట్లు వ్యవహరిస్తుండడంతో ఓ వైపు రైతులు, ఇంకోవైపు మత్స్యకారులు ఉపాధి కోల్పోతున్నామని ఆందోళన చెందుతున్నారు.

ఫిర్యాదుల పరంపర

పలు చెరువులకు సంబంధించి భూముల ఆక్రమణలపై మత్స్యకారుల నుంచి ఫిర్యాదులు వెల్లువెత్తున్నాయి. జిల్లాలోని 876 చెరువుల్లో మత్స్యకారులు చేపలు పెంచుతుండగా, బోనకల్ మండలం తూటికుంట్ల శివారు ప్రొద్దుటూరు చెరువు సుమారు 100 ఎకరాలకు గాను 50 ఎకరాల మేర ఆక్రమణకు గురైందని స్థానికులు ఫిర్యాదు చేశారు. నేలకొండపల్లి మండలం చెరువుమాదారం శివారు నాచేపల్లి, బైరవునిపల్లి, చెరువుమాధారం గ్రామాలకు ఉపయోగపడేలా 830 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న సహజాద చెరువులో 180 ఎకరాలు ఆక్రమణకు గురైందన్న ఫిర్యాదుతో అధికారులు విచారణ చేపడుతున్నారు. సింగరేణి మండలంలోని 184 ఎకరాల పెద్దచెరువు లోతట్టులో కొంత ప్రాంతంతో పాటు అలుగుల వద్ద ఆక్రమణలు జరిగాయని ఫిర్యాదులు అందాయి. ఈ వ్యవహారంపై కోర్టులో కేసు కొనసాగుతోంది. అంతేకాక కామేపల్లి మండలం కొండాయిగూడెం, సింగరేణి మండలం రేలకాయలపల్లి, వైరా మండలంలోని కలకోట, కల్లూరు మండలంలోని ముచ్చారం చెరువు, తల్లాడ మండలంలోని గూడూరు రంగన్న చెరువు ఏన్కూరు మండలంలోని తూతులింగన్నపేట, ఖమ్మం రూరల్ మండలంలోని ఆరెంపుల, బారుగూడెం, కొణిజర్ల మండలంలోని గుండ్రాతిమడుగు తుమ్మలచెరువు, చింతకాని మండలంలోని పలు చెరువుల భూములు ఆక్రమణకు గురైనట్లు మత్స్య, రెవెన్యూ, ఇరిగేషన్ శాఖలకు ఫిర్యాదు చేశారు.


సింగరేణి మండలం రేలకాయలపల్లి పెద్దచెరువు లోతట్టులో ఆక్రమణదారులు ఏర్పాటుచేసిన హద్దురాళ్లు


చెరువు లోతట్టు ప్రాంతంలో చేపలు పడుతున్న మత్స్యకారులు

ఏక్‌సాల్ పట్టా పేరిట చేపల చెరువులు

వానాకాలంలో చెరువుల నీటిని పంటలకు వినియోగించడం.. యాసంగి సీజన్ నాటికి చెరువులు ఖాళీ అయితే సమీప రైతులు శిఖం భూముల్లో జనుము, మినుము, శనగ వంటి పంటలు సాగు చేయడం ఆనవాయితీగా వస్తోంది. ఇదే అదునుగా కొందరు ఏక్‌సాల్ పంట పేరిట ఏకంగా చేపల చెరువులను తవ్వి వ్యాపారం చేస్తున్నారు. ఇందుకోసం శిఖంలోని లోతట్టులో మట్టి నింపి మెరక చేసుకుంటున్నారు. కొన్ని చెరువుల్లోనైతే అలుగులను పూడ్చి స్వాధీనం చేసుకోవడం.. ఆపై పంట భూములుగా మార్చుకుంటున్నట్లు తెలుస్తోంది.

అధికారుల కనుసన్నల్లోనే...

చెరువుల ఆక్రమణలు ప్రభుత్వ శాఖల అధికారులకు తెలిసే జరుగుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ శాఖల అధికారులు, ఉద్యోగుల సహకారంతో అక్రమార్కులు ప్రభుత్వ భూములను స్వాహా చేస్తున్నట్లు ఆరోపణలున్నాయి. ఇంకొందరు లొసుగులను ఆసరాగా చేసుకుని చెరువుల లోతట్టు భూములను ఆక్రమిస్తున్నారని, ఇది కళ్ల ముందే జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని మత్స్యకారులు, రైతులు విమర్శిస్తున్నారు.

మత్స్యకారుల ఉపాధిపై దెబ్బ

జలాశయాల ఆక్రమణల పర్వం మత్స్యకారుల ఉపాధిని దెబ్బతీస్తోంది. జిల్లాలో 215 మత్స్య సహకార సంఘాలు ఉండగా, వీటి పరిధిలోని 876 చెరువుల్లో చేపల పెంపకం సాగుతోంది. తద్వారా 16వేల మందికి పైగా మత్స్యకారులు ఉపాధి పొందుతున్నారు. అయితే, నానాటికి చెరువులు ఆక్రమణకు గురవుతుండటంతో మత్స్య సహకార సంఘాలు మేల్కొన్నాయి. జీవన భృతి దెబ్బతింటున్నందున చెరువులను అక్రమార్కుల చెర నుంచి కాపాడాలని కలెక్టర్‌తో పాటు మత్స్య, రెవెన్యూ, ఇరిగేషన్ల శాఖల అధికారులకు ఫిర్యాదు చేస్తున్నారు.

ఆక్రమించి.. హద్దులు పాతి

చెరువుల లోతట్టు భూములను ఆక్రమించడమే కాక ఆయా భూముల్లో హద్దులు కూడా వేసుకుంటున్నారు. చెరువులోనే తమ భూమి ఉందంటూ సరిహద్దుగా కంచె పాతుతున్నారు. సింగరేణి మండలం రేలకాయలపల్లి పెద్దమ్మ చెరువులో ఇలా జరిగిందని మత్స్యకారులు ఆధారాలతో సహా అధికారులకు ఫిర్యాదు చేశారు. కొణిజర్ల మండలం గుండ్రాతిమడుగు తుమ్మల చెరువులో ఏకంగా కట్టలు తొలగించి దాదాపు 30 ఎకరాల మేర క్రమించినట్లు చెబుతున్నారు.

ఎఫ్‌టీఎల్‌ను నిర్దేశిస్తేనే సమస్యకు తెర



చెరువుల ఎఫ్‌టీఎల్(ఫుల్ ట్యాంక్ లెవల్) హద్దులను నిర్దేశిస్తే ఆక్రమణల సమస్య ఉండదు. జలాశయాల భూములు ఆక్రమణకు గురవుతున్నాయని మత్స్యకారులు, మత్స్య సహకార సంఘాల నుంచి ఫిర్యాదులు అందుతున్నాయి. ఇప్పటికే పలు చెరువులను పరిశీలించాం. ఇరిగేషన్, వ్యవసాయ, రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లి మత్స్యకారులకు న్యాయం జరిగేలా కృషి చేస్తాం.

– శివప్రసాద్, జిల్లా మత్స్యశాఖ అధికారి

సాగర్ కాల్వలో వ్యక్తి గల్లంతు

ఖమ్మంరూరల్: రూరల్ మండలం పల్లెగూడెం వద్ద సాగర్ కాల్వలో బుధవారం రాత్రి గోలి అశోక్(38) గల్లంతయ్యాడు. మండలంలోని ఇందిరమ్మ కాలనీకి చెందిన అశోక్‌కు పదహారేళ్ల క్రితం వివాహం జరగగా ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆయన భార్య పిల్లలను తీసుకుని పుట్టింటికి వెళ్లగా సోదరుడి ఇంట్లో ఉంటున్నాడు. కాగా, తన స్నేహితుడు ఆవుల గురుస్వామితో కలిసి సాగర్ కాల్వలో స్నానానికి వెళ్లిన అశోక్ ప్రమాదశాత్తు కాలు జారి కాల్వలో పడి కొట్టుకుపోయాడు. దీంతో బంధువులు పోలీసులకు సమాచారం ఇవ్వగా గాలింపు చేపట్టారు.

చికిత్స పొందుతున్న మహిళ మృతి


నాగమణి (ఫైల్)

బోనకల్: గత నెల 31వ తేదీన కూలీలతో వెళ్తున్న ట్రాక్టర్ బోల్తా పడడంతో ఒకరు మృతి చెందారు. ఈ ఘటనలో మరో 23మందికి గాయపడగా పరిస్థితి విషమించిన ఇద్దరికి ఖమ్మం మమత ఆస్పత్రిలో చికిత్స చేయిస్తున్నారు. ఇందులో లింగం నాగమణి(55) బుధవారం మృతి చెందింది. ఆమెకు భర్త, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

తీర్థాల జాతరలో భక్తుల ఇక్కట్లు

- ఐదు గంటల పాటు ట్రాఫిక్ జామ్
- బస్సులు రాకపోవడంతో భక్తుల పడిగాపులు


కామంచికల్ మార్గంలో నిలిచిపోయిన వాహనాలు



ఖమ్మంరూరల్: రూరల్ మండలం తీర్థాలలోని సంగమేశ్వర ఆలయానికి మహాశివరాత్రి సందర్భంగా బుధవారం భక్తులు పోటెత్తారు. జిల్లా నలుమూలల నుంచే ఉమ్మడి వరంగల్, నల్లగొండ జిల్లాలకు చెందిన లక్షన్నర మంది భక్తులు జాతరకు హాజరైనట్లు అంచనా. అయితే, ఖమ్మం నుండి గోళ్లపాడు, కామంచికల్ మార్గంలో సుమారు అయిదు గంటల పాటు ట్రాఫిక్ జామ్ కావడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఓవైపు ఎండ, మరోవైపు పిల్లలు, వృద్ధులతో ట్రాఫిక్‌లో చిక్కుకుపోయారు. ఖమ్మం నుండి ఆలయ సమీపానికి ఆర్‌టీసీ ప్రత్యేక బస్సులు నడిపించగా, స్వామి దర్శనం అనంతరం మధ్యాహ్నం ఒంటి గంటకల్లా పెద్ద సంఖ్యలో భక్తులు తాత్కాలిక బస్టాండ్‌కు చేరుకున్నారు. అయితే, సాయంత్రం ఐదు గంటల వరకు ఒక్క బస్సూ రాకపోవడంతో అసహనానికి గురై ఆర్‌టీసీ ఉద్యోగులను నిలదీశారు. అంతేకాక ట్రాఫిక్‌లో బస్సులు నిలిచిపోయి ముందుకు కదలకపోవడంతో టికెట్ డబ్బులు వెనక్కివ్వాలని డిమాండ్ చేశారు. ఎట్టకేలకు సాయంత్రం ఐదు గంటల తర్వాత ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించడంతో వాహనాలు ముందుకు కదిలాయి.

ధరలు పెంచి ప్రసాదాల అమ్మకం

ఆలయం వద్ద గతంలో రూ.50 ఉన్న స్వామివారి అభిషేకం లడ్డూ ధరను ఈసారి రూ.100కు పెంచారు. అలాగే, రూ.10గా ఉన్న చిన్న లడ్డూ, పులిహోర ప్యాకెట్లను రూ.25కు పెంచడం గమనార్హం. వ్యాపారులతో ఆలయ అధికారులు కుమ్మక్కవడంతోనే ఇలా జరిగిందని భక్తులు మండిపడ్డారు.


ఆర్టీసీ బస్టాప్ వద్ద ఎదురుచూస్తున్న భక్తులు


అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న భక్తులు

ఇక జాతరలో మద్యం అమ్మకాలు యథేచ్ఛగా కొనసాగినా ఎక్సైజ్ అధికారులు కన్నెత్తి కూడా చూడకపోవడం విమర్శలకు తావిచ్చింది.